క్లుప్తంగా

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో ధర్మవరం కళాకారిణి


జ్ఞాపిక, సర్టిఫికెట్లతో రామలాలిత్య

ధర్మవరం అర్బన్: కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో ధర్మవరం కళాకారిణి ప్రతిభ చాటింది. కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల సందర్భంగా రెండు వేల మంది కళాకారులతో నిర్వహించిన మహా బృంద నాట్యంలో ధర్మవరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కుమార్తె రామలాలిత్య పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ వారి ద్వారా రామలాలిత్యకు జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందించారు. గురువు బాబుబాలాజీకి మెమెంటో ప్రదానం చేశారు.

జేఎల్ఎంను నియమించండి

ఎన్పీకుంట: మరికొమ్మదిన్నె సచివాలయం పరిధిలో జేఎల్ఎంను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీటీసీ సభ్యులు తిమ్మారెడ్డి, తిరుమలనాయుడు, బాబా తదితర రైతులు మాట్లాడుతూ రెండు నెలలుగా జేఎల్ఎం లేక ఎగ్స్‌ఫ్యూజులు మార్చడానికి, వీధిదీపాల నిర్వహణ తదితర విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయమై ఏఈ సాలేహబాషాను వివరణ కోరగా మరికొమ్మదిన్ని సచివాలయంలో జేఎల్ఎం పోస్ట్ ఖాళీ ఉందని, ఇక్కడ విధులు నిర్వహించే 'పోల్ టు పోల్' సిబ్బంది మాలిక్ అనారోగ్య సమస్యతో మెడికల్ లీవ్‌పై వెళ్లాడని తెలిపారు. సమస్యను తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సిబ్బందిని నియమిస్తామని చెప్పారు.

రాగి ఆహారం ఆరోగ్యకరం

అమడగూరు: రాగితో కూడిన ఆహారం ఆరోగ్యకరమని ఏడీఏ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మహమ్మదాబాద్ రైతు సేవ కేంద్రంలో రైతులకు వ్యవసాయాధికారులు రాగిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో రాగి సాగు చేసి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సనావుల్లా, ఏఓ, ఏఈఓ, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

రాగి సాగుపై అవగాహన

ఓడీచెరువు : ఆకుతోటపల్లిలో రైతులకు సోమవారం రాగి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఏఓ ఇలియాజ్ మహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు సత్యనారాయణ, సనావుల్లా, సివిల్ సప్లయీస్ సిబ్బంది పాల్గొన్నారు

కుల వివక్ష చూపితే చర్యలు

చెన్నేకొత్తపల్లి: దళితవాడల్లోని ప్రజలు ఐకమత్యంగా ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలోని దళితవాడలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎక్కడైనా కుల వివక్ష చూపితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చట్టాలను దుర్వినియోగం చేయొద్దు

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని, అనవసరంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను దుర్వినియోగ పర్చవద్దని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. సోమవారం మండలంలోని కోడేకండ్ల ఎస్సీ కాలనీలో ఆర్డీటీ కమ్యూనిటీ హాలులో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా ప్రజల ప్రాథమిక హక్కులపై సర్పంచ్ బండి సరస్వతి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడారు.

డ్రిప్ పరికరాల చోరీ

నల్లచెరువు: పాయలవాండ్లపల్లిలో మస్తాన్‌కు చెందిన డ్రిప్ పరికరాలు చోరీ అయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయలవాండ్లపల్లి బస్టాప్ సమీపంలోని బోరుబావి వద్ద రేకుల షెడ్‌లో మస్తాన్ డ్రిప్ పరికరాలు ఉంచి తాళం వేసి, శనివారం సాయంత్రం బంధువుల వివాహానికి వెళ్లాడు. సోమవారం ఉదయం షెడ్ వద్దకు వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడం, అందులోని డ్రిప్ పరికరాలు,పైపులు కనిపించకపోవడం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భూములు ఆక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో భూములు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లకు తాను వ్యతిరేకం కాదదన్నారు. ప్రజలు తమ స్థలాలను రెగులరైజ్ చేసుకోవాలన్నారు. వెకెట్‌ల్యాండ్, పీనలైజేషన్ ఫీజు చెల్లించాలన్నారు. పీనలైజేషన్ ఫీజు ఎక్కువ అడిగితే టోల్ ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

అడ్డదిడ్డం.. అస్తవ్యస్తం

వారికి వ్యాపారమే పరమావధి. ఉన్న స్థలం వదిలి రోడ్డు ఆక్రమించి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వినియోగదారుల వాహనాల పార్కింగ్‌తో రోడ్డు మరింత కుంచించుకుపోతోంది. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి గాంచిన ధర్మవరంలో ఈ పరిస్థితి నెలకొంది.

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- వ్యాపార కూడళ్లలో ఇష్టారాజ్యం
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం


ప్రధాన రహదారిపైనే ఆటోలు, బొలెరో వాహనాలు ఉంచి సరుకులు దించుతున్న దృశ్యం


కళాజ్యోతి సర్కిల్ నుంచి దుకాణాల ముందు రహదారిపైనే ద్విచక్రవాహనాలు



ధర్మవరం అర్బన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. వ్యాపార కూడళ్లు, మార్కెట్, ప్రధాన రహదారుల వెంబడి స్థలం లేక వాహనాలను రోడ్డు మీదే నిలుపుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్, కాలేజీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీనగర్ సర్కిల్, సుదర్శన్ కాంప్లెక్స్, తేరుబజార్, అంజుమన్ సర్కిల్, నేసేపేట, మార్కెట్‌వీధి తదితర ప్రాంతాల్లో పట్టుచీరల దుకాణాలు, బంగారు దుకాణాలు, వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాలు, పూలు, పండ్లు, నూనె, మెడికల్ షాపులు, బేకరీలు, తోపుడుబండ్లు, హోటళ్లు, బ్యాంకులు, సెల్‌ఫోన్ సెంటర్లు, కూరగాయల దుకాణాలు దాదాపు 500కు పైగానే ఉన్నాయి. హోల్‌సేల్ వ్యాపారాలు మొదలుకుని రిటైల్ వ్యాపారం రోజుకు సరాసరి రూ.5 కోట్లకుపైగా జరుగుతోంది. వ్యాపార లావాదేవీల కోసం ఇతర ప్రాంతాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి రోజూ వేల సంఖ్యలో వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. ప్రధాన రోడ్లన్నీ వినియోగదారులతో కిటకిటలాడుతుంటాయి. ఈ క్రమంలో వాహనాలను నిలపడానికి జానెడు స్థలం లేక తంటాలు పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీసులు ఈ అంశంపై దృష్టి సారించి అన్ని ప్రధాన కూడళ్లలోనూ పార్కింగ్ సదుపాయం కల్పించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

మున్సిపాలిటీ	ధర్మవరం
పట్టణ జనాభా	1.28 లక్షలు
వార్డులు	40 వార్డులు
ప్రధాన కూడళ్లలో దుకాణాలు	500 పైనే

అధికారులు చొరవ చూపాలి



వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చొరవ చూపాలి. పన్నుల రూపంలో వచ్చే సొమ్మును సక్రమంగా వినియోగించుకుని ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పట్టణంలో వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించాలి.

– దాసరి రాము, ధర్మవరం

జానెడు స్థలం దొరకదు



గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం ధర్మవరానికి వచ్చేవారు ద్విచక్ర వాహనం పార్క్ చేయాలంటే జానెడు ఖాళీ స్థలం ఉండటంలేదు. రోడ్ల పక్కనే నిలపాల్సి వస్తోంది. అధికారులు దృష్టి సారించి పార్కింగ్ స్థలాలు చూపితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసి షాపింగ్ చేసేందుకు వీలుంటుంది.

– అజంతా కృష్ణ, ధర్మవరం పట్టణం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పట్టణంలో ద్విచక్రవాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు లేవు. దుకాణాల ముందు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అంజుమన్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఉన్న తోపుడుబండ్లను ఒకవైపునకు పెట్టించాం. ద్విచక్రవాహనాలు రోడ్డుకు అడ్డంగా పెడితే జరిమానా విధిస్తాం. వాహనదారులు పోలీసుశాఖకు సహకరించాలి. ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.

– ఎస్.వెంకట్రాముడు, ట్రాఫిక్ ఎస్ఐ, ధర్మవరం

కనీస సమాచారం ఇవ్వకపోతే ఎలా?

- ఎంపీడీఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ గంగోజమ్మ

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సభలు, సమావేశాలు, కార్యక్రమాలకు సంబంధించి తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపీపీ గంగోజమ్మ ఎంపీడీఓ వెంకటరామిరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టే కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. తమను సంప్రదించకుండానే అటవీ ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ పనులు చేపట్టడం వల్ల అగ్ని ప్రమాదాల సమయంలో నివారణ చర్యలకు ఇబ్బందులు పడుతున్నామని బీట్ అధికారి అనిల్‌కుమార్ సభ దృష్టికి తెచ్చారు. రాయచోటి డిపో హైర్ బస్సులను డ్రైవర్లు అతివేగంగా నడుపుతున్నారని, ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మద్దివారిగొంది సర్పంచ్ నాగభూషణంరెడ్డి ఆర్టీసీ సిబ్బందిని నిలదీశారు. కదిరి – గాండ్లపెంటకు ఉదయం 9 గంటల సమయంలో బస్సులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. రాయచోటి డిపో బస్సులు సమయ పాలన పాటించి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నడిపేలా చూడాలని కోరారు. మండలానికి హంద్రీ–నీవా జలాలు తీసుకురావాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములునాయుడు సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. చివరగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించడంలో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయంపై జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ భారతి, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామాకు డిమాండ్

పుట్టపర్తి టౌన్/ కదిరి టౌన్/ ధర్మవరం: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేసి, ప్రజలకు క్షమాపణ చెప్పాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తి, కదిరి, ధర్మవరం పట్టణాల్లో సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా

ధర్మవరం: సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ కోసం మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని మెప్మా విభాగం, హోమ్ ట్రయాంగిల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రకాలైన సర్వీస్ ప్రొవైడర్లు అనగా కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ (టీవీ, ఏసీ, గీజర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ ప్యూరిఫయర్ రిపేరీ చేసేవారు), బ్యూటీషియన్ (మెన్, ఉమెన్) తదితర సేవలు అందించే వారి నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వీరికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించి ఎన్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్‌తోపాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్ బోర్డు చేసి జీవనోపాధి కల్పించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి ఐదో తేదీలోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్, విద్యార్హత సర్టిఫికెట్లు, 2 పాస్‌ఫోటోలు అన్ని జిరాక్స్ తీసుకుని మెప్మా విభాగంలో సంప్రదించాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల నిఘా
- నేడు ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులు
- డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కొనసాగింపు
- అర్ధరాత్రి వరకు 30 యాక్ట్ అమలు

పుట్టపర్తి టౌన్: నూతన సంవత్సర వేడకలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, పుట్టపర్తిలో ఎవరైనా పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ విజయకుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలికే వేడుకలను పరిమితికి లోబడి చేసుకోవాలని సూచించారు. ఘర్షణలకు తావివ్వకూడదని పేర్కొన్నారు. రోడ్లపై కేక్ కటింగ్ డీజే సౌండ్ నడుమ చిందులు వేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు నిర్ణీత సమయానికే మూసేయాలన్నారు. అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బంది పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ కొనసాగిస్తామని తెలిపారు. నేటి అర్ధరాత్రి వరకు 30 యాక్ట్ అమల్లో ఉంటుందని, హద్దు మీరితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

ధర్మవరం అర్బన్: నూతన సంవత్సరం వేడుకల్లో నిబంధనలను అతిక్రమించవద్దని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప సోమవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చెన్నేకొత్తపల్లి: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ ప్రజలకు సూచించారు. మంగళవారం రాత్రి ప్రజలు రోడ్లపైకి రాకుండా ఇళ్లలోనే కేక్ కట్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేడుకల్లో జాగ్రత్తలు పాటించండి

బత్తలపల్లి: నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ప్రజలకు సూచించారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వేడుకల ముసుగులో ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ చాంపియన్స్ 'ధర్మవరం'



కబడ్డీ చాంపియన్స్‌గా నిలిచిన ధర్మవరం బాలుర జట్టు

ధర్మవరం అర్బన్: అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన సెంట్రల్ జోన్ లీగ్ పోటీల్లో ధర్మవరం బాలుర జట్టు కబడ్డీ చాంపియన్స్‌గా నిలిచింది. రన్నరప్‌గా ధర్మవరం బాలికల జట్టు నిలిచిందని ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కబడ్డీ కోచ్ పృథ్వీ, హాకీ కోచ్‌లు అనిల్‌కుమార్, రాజశేఖర్ తెలిపారు. విజేతలైన క్రీడాకారులను సోమవారం వారు ధర్మవరంలో అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో సోమవారం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర అనుబంధ సంస్థ సోషల్ సోల్జర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, పీఈటీ రాజేష్, అధ్యాపకులు హరిబాబు, కోచ్ పృథ్వీరాజ్, వీరప్ప పోటీలను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించేందుకు ముందుకు రావాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు.

పుచ్చకాయ సాగులో సస్యరక్షణ చేపట్టండి

ఎన్పీకుంట: పుచ్చకాయ సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం వారు గోవిందురాజులపల్లికి చెందిన ఆర్.లక్ష్మిరెడ్డి సాగు చేసిన పుచ్చకాయ పంటను పరిశీలించారు. పంటలో రసంపీల్చే పురుగు, మచ్చతెగులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పుచ్చకాయ పంట పెట్టే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం టమాట, మిరప, వంగ వంటి పంటలు సాగు చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కదిరి అర్బన్: సైదాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ రామచంద్రయ్య, సీఈఓ హనుమంతరెడ్డి కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా ఆంజనేయులు

నల్లమాడ: బీజేపీ మండల అధ్యక్షునిగా గంగాపురం గ్రామానికి చెందిన సాడగల ఆంజనేయులు నియమితులయ్యారు. సోమవారం జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

కదిరి అర్బన్: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సోమవారం కదిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్, నాయకులు విజయ్‌కుమార్, అఖిల్, హర్ష, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై విస్తృత ప్రచారం

అమడగూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఉంట్లవారిపల్లి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పేరంవాండ్లపల్లి, ఎ.కొత్తపల్లి, చెర్లోపల్లి, కొలిమిరాళ్లపల్లి గ్రామాల్లో ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేశారు.

డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి

బత్తలపల్లి: వాహనాలు నడిపే డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. సోమవారం బత్తలపల్లిలో ఆయన వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అపరిశుభ్రతపై ఫిర్యాదు

ఓడీచెరువు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో అపరిశుభ్రత, కుక్కలు, పందుల బెడదపై ఓడీసీ యువసైన్యం సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు మండలి పూజ

అమడగూరు: స్థానిక సద్గురు సాయినాథ ఆలయంలో మంగళవారం అర్చకులు శేఖర్ శర్మ, సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో మండలి పూజ, హోమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మానవీయ విలువలు అలవరచుకోవాలి

బత్తలపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ మానవీయ విలువలను అలవరచుకోవాలని మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రత్యేక ఆహ్వానితులు గోవిందరాజులు విద్యార్థులకు సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలుర విద్యాలయంలో విద్యార్థులకు 'మానవీయ విలువలు, కుటుంబం, సమాజం' అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

కంటి వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: కంటి చూపుపై విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప సూచించారు. గంగినేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

అమడగూరు: దళిత వాడల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు.

గుండెపోటుతో మహిళ మృతి

నల్లచెరువు: కె.పూలకుంటకు చెందిన బత్యాల శివమ్మ (57) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఈమె కుమారులు చంద్ర, శ్రీరాములు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు కళ్లిపల్లి శ్రీనివాసులు, సూరి మృతురాలి గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చేతిపంపు రిపేరీ

నల్లమాడ: దొన్నికోట ప్రాథమిక పాఠశాలలో కొద్ది రోజుల క్రితం పాడైపోయిన చేతిపంపును సర్పంచ్ రాగినేని సరస్వతి, నాగరాజునాయుడు దంపతులు సోమవారం రిపేరీ చేయించారు. ఎంఈఓ వేమనారాయణ, హెచ్ఎం రవీంద్రారెడ్డి చేతిపంపును పరిశీలించారు. బోరు రిపేరీ చేయించి సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

తాడిమర్రి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బీసాని నరేష్ (30) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈయనకు భార్య, నాలుగేళ్లలోపు వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి సోమవారం ఉదయం కాలనీకి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

కేజీబీవీలో సిబ్బంది నియామకం

ధర్మవరం రూరల్: కేజీబీవీలో కేటగిరి 3, 4 కింద వై.విజయలక్ష్మి, దుర్గాభవాని నియమితులయ్యారు. వీరికి సోమవారం ఉత్తర్వులను అందజేసినట్లు ఎంఈఓలు గోపాల్ నాయక్, పి.రాజేశ్వరిదేవి తెలిపారు.

సీసీ రోడ్డు కోసం ఇంటిని పడగొట్టారు

ఓడీచెరువు : వణుకువారిపల్లిలో నీళ్ల ట్యాంకు దగ్గర నుంచి ఉత్తమ్మ ఇంటి వరకు నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు కోసం బాబ్జాన్‌కు చెందిన ఇంటిని పడగొట్టారని బాబాయి అస్రఫ్ అలి సోమవారం తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన 17 సంవత్సరాల వయసు కలిగిన బాబ్జాన్ పొట్టకూటి కోసం ఇతర ప్రాంతానికి వలస వెళ్లాడని, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అతని ఇంటిని ఎందుకు పడగొడుతున్నారని ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకో అని పనులు చేయిస్తున్న వారు బెదిరించారని ఆరోపించారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం

ముదిగుబ్బ: సమష్టి కృషితో ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆర్డీఓ మహేష్ సూచించారు. సోమవారం ముదిగుబ్బలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. నిల్వ ఉంచిన రేషన్ సరుకులను పరిశీలించారు. సరుకుల సరఫరాలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఆర్డీఓ వెంట స్టాక్‌పాయింట్ అధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయంలో మెలకువలు నేర్చుకునేందుకు వచ్చిన ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి ఆర్‌ఎస్‌కే వద్ద ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్రొఫెసర్లు గణేష్, సంధ్య పృథ్వీరాజ్, విద్యార్థులు ఆరోగ్య నిపుణులతో సుమారు 80 పశువులకు వైద్య సేవలందించారు.

పెయ్యదూడల గర్భధారణ చికిత్సలు

తలుపుల : జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం గంజివారిపల్లిలో పెయ్యదూడల గర్భధారణ చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నారాయణస్వామి నాయక్, వీహెచ్ఏలు, జీఎంలు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకల రద్దు తగదు

ముదిగుబ్బ: గుంతకల్లు – తిరుపతి ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 28 నుంచి రెండు నెలల పాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందుకూరి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైళ్ల రద్దుతో తిరుపతికి వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.